


# వీరోచితవర్తకం

శ్రీ మధురాంతకం రాజారాం

## 1

వ్యాపారం ద్రోహచింతనమని చాలామంది అభిప్రాయం. దైనందిన జీవితంలో మనకు వర్తకుని అవసరం ఎంతవున్నా అతనిమీద సదభిప్రాయం లేకపోవడం విచారింపవలసిన విషయమే! వేములవాడ భీమకవి ఒకమారు 'కోమటి కొక్కటిచ్చి పదిగొన్నను దోషము లేదని', రెండవసారి 'కోమటి కొక్కటీక పదిగొన్నను దోసములేదని' వర్తకులపై తనకుగల ద్వేషాన్ని చాటుకొన్నాడు.

శంకరరాజుగూడా ఒక వర్తకుడే కానీ అతని విధానమే వేరు. అతని పూర్వీకులు బొబ్బిలికోటపై నిలచి ఫ్రెంచివారి ఫిరంగి గుండ్లకు రొమ్ము చూపించిన వీరులు. కోరమీసాలతో, ఎఱ్ఱగుడ్లతో, గంపంత తలపాగతో, కిర్రుచెప్పులతో శంకరరాజు వీథి వెంట నడుస్తున్నప్పుడు అతడు యుద్ధరంగానికి వెళ్లే సేనాధిపతివలె కనిపిస్తాడు గాని, జమా ఖర్చు పుస్తకాలు సరిచూడగల వర్తకునివలె కనిపించడు.

రమారమి నాలుగేండ్లనుంచి ఆ పసుపు పచ్చని మేడ మూడవ అంతస్తు గోడకు 'శంకరరాజు అండ్ బ్రదర్స్' అనే బోర్డు వ్రేలాడుతున్నది. శంకరరాజుకు ఇద్దరు తమ్ముళ్ళున్నారు. లింగరాజు, వెంగళరాజు అని వారి పేర్లు.

తండ్రి సంపాదించిన యావదాస్తిని విక్రయించి శంకరరాజు కుటుంబసమేతముగా విజయవాడకు తరలినప్పుడు ఆతని శ్రేయోభిలాషులెన్నో విధాల మందలించారు. "అబ్బాయీ! వర్తకమంటే మల్లయుద్ధం వంటిది కాదు, ఎవరికి బలంవుంటే వాళ్ళు గెలవడానికి. అంగిట బెల్లం ఆత్మలో విషం గలవాడు మట్టుకు వర్తకంలో వృద్ధికి రాగలడు. నీవల్ల ఏం చేతనౌను? తమ్ముళ్లను చేతిక్రింద పెట్టుకొని ఉన్నపొలం సాగు చేయించుకుంటే నువ్వు రాజాగా బ్రతకవచ్చు." ఇటువంటి మాటల్ని శంకరరాజు లెక్క చేయలేదు. 'నేను వెలమబిడ్డను. చోచో అని నన్ను ఎద్దుల్ని అదలించమంటారా? నేను విజయవాడ వెళ్తాను. వర్తకంచేస్తాను. ఆవర్తకంగూడా సామాన్యమైంది గాదు. వీరోచితమైన వర్తకం.' అని శంకరరాజు తన నిశ్చయం తెలియ జెప్పాడు.

## 2

నాలుగేండ్లలో శంకరరాజు పలువైవ్యాపారాలు చేశాడు. పదులుగా, నూర్లుగా, వేలుగా వచ్చిన నష్టాలనన్నిటినీ కిక్కురుమనకుండా భరించాడు. యుద్ధభూమిలో నిలువెల్ల-గాయాలయినా వెను దీయని శూరునివలె శంకరరాజు తన వర్తకంలో వీరోచిత విధానాన్ని చూపించాడు.

ఇంత శీఘ్రకాలంలో ఒక లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభించబడ్డ శంకరరాజు గారి వ్యాపారం స్తంభించి పోవడానికి అతని తెలివిహీనత కారణమని చెప్పలేం. అడిగినవానికి లేదనకుండా యివ్వడం ఒకటి, యిచ్చిన తరువాత నిర్బంధంగా అడగలేకపోవడం రెండు. ఎవడైనా సరే తనకు

మోసంచేశాడని తెలిస్తే వాణ్ణి నడివీథిలో నే పట్టుకొని చావగొట్టడం ఖాయం! ఇటువంటి వీరోచిత ప్రవర్తనలవల్ల రాజుగారి వ్యాపారం నానాటికి తీసికట్టయిపోయింది.

కట్టకడపట ఒక యిరవై వేల రూపాయలు బాకీ సాకీ చేసి శంకరరాజు ఎముకల వ్యాపారం ప్రారంభించాడు. సర్కారు వారు కొత్తగా కనిపెట్టిన ఎరువులను తయారుచేసేందుకు ఎముకలను సేకరింపజూచారు. రాజుగారి దూరదృష్టి భావిలో ఎముకలకు రాగల ఇన్‌ప్లేషన్‌ను గుర్తించింది. వెంటనే వాడవాడలా ఏజెంట్లు నియమింపబడ్డారు. ఎముకల సేకరణ అతి తీవ్రంగా జరిగింది. కానీ ప్రతి ఏజంటూ వందలు వందలుగా డబ్బును కాజేసి ఒకటి రెండు గంపల ఎముకలను రాజుగారి హెడ్ క్వార్టర్సుకు రవాణాచేయడంచేత వ్యాపారము నిలచిపోవడమే గాక బాకీదారుల ఎద్దడికూడా హెచ్చింది.

ఇటువంటి క్లిష్టపరిస్థితిలో శంకరరాజు మేధస్సులో ఒక అత్యద్భుతమైన ఆలోచన జన్మించింది. ఈ ఆలోచన సామాన్యమైందిగాదు, వీరోచితమైంది.

## 3

పసుపురంగు మేడ మూడవ అంతస్తులో 'శంకరరాజు అండ్ బ్రదర్స్' వారి అంతరంగిక సమావేశం ప్రారంభమయింది. బొబ్బిలికోట నేలమట్టమై పోయింతర్వాత నిస్సహాయుడైన పాపారాయనివలె శంకరరాజు తన అంతిమ నిర్ణయాన్ని వివరించాడు. 'ఇన్నినాళ్ళు వ్యాపారం చేశాం. పుట్టింది మొదలు మనం ఎవణ్ణీగాని దేహీ అని యాచించలేదు. ఇకమీద మన పరువు ప్రతిష్ఠలకు హానికలిగే సూచనలు కనపడుతున్నాయి. మానం పోయిన తరువాత ప్రాణాన్ని ఉంచుకోడం వెలమబిడ్డ చేసే పనికాదు. ఇప్పుడున్నది ఒకటే ఉపాయం!

"ఏమది, ఏమది అన్నట్టుగా" అన్నదమ్ములు శంకరరాజు ముఖంలోకి చూశారు.

'ఈ పరిస్థితినుండి మనం తేరుకోవడానికి ఇంచు మించు యిరవై వేల రూపాయలు అత్యవసరం. మనకు బాకీ పుట్టదు. మనం ముగ్గురమున్నూ ఒక్కొక్కరూ యిరవై వేలకు ఇన్‌ష్యూర్ చేసుకొని ఉన్నాం గదా! మనలో ఏ ఒకడు చనిపోయినా ఆడబ్బు మిగతా యిద్దరికీ ముట్టుతుంది.'

మాట్లాడినంతవరకు మాత్రమే అర్థంచేసుకొన్న అన్నదమ్ములు శంకరరాజు మాటలను అతి జాగ్రత్తగా వినడం ప్రారంభించారు.

'కాబట్టి మనలో ఒకరు మిగత యిద్దరి కోసం చచ్చిపోవాలి.'

లింగరాజు ఖంగారుతో అడ్డువచ్చాడు 'చచ్చేది బ్రతికేది మనచేతిలో ఉందా అన్నా? పురాణాల్లోగూడా ఈ శక్తి భీష్ముని కొక్కనికి తప్ప యింకెవరికీ ఉన్నట్టు తెలియడం లేదే' అని అతను తన సందేహాన్ని, పురాణజ్ఞానాన్ని స్పష్టంగా తెలుపుకొన్నాడు.

తమ్ముని తెలివిహీనతకు చింతిస్తూ శంకరరాజు 'చనిపోయేది అంటే యముడు తనకు తానైవచ్చి మనల్ని తీసుకుపోవడం కాదు. మనకు మనమయ్యే వాణ్ణి వెదుక్కుంటూ పోవాలి' అని తన నిర్ణయాన్ని అక్షరక్షరం నొక్కి చెప్పేశాడు.

'ఆత్మహత్య జేసుకుంటే ఇన్‌ష్యూరెన్సు డబ్బు ముట్టదే' అని కడపటితమ్ముడు వెంగళరాజు అన్నగారి నోటికి తాళం వేయజూచాడు. కానీ శంకరరాజు ఆ ఒందేకాన్ని పటాపంచలు చేశాడు. 'జరిగేదేమొ ఆత్మహత్యే! కానీ అది అనుకోని విధంగా అకస్మాత్తుగా జరిగినట్లు లోకులకు తెలియాలి!'

రెండునిమిషాలు నిశ్శబ్దంగా గడచిన తరువాత శంకరరాజు మళ్ళీ ప్రారంభించాడు. 'మన ఆఫీసు మూడవ అంతస్తులో ఉండడం ఈపనికి చాలా సౌకర్యం. వరాండా పిట్టగోడను ఆనుకొని రోడ్డువైపు చూస్తున్నట్టే ఉండికాళ్లుకొంచెం యెత్తేస్తే చాలు ఇంత పైనుంచీ రోడ్డులో పడిన తరువాత ఏమాత్రం బ్రతకడానికీ అవకాశమే లేదు!' ఈ విధంగా తన ప్లానును విశదీకరించి ఇక ప్రశ్నకే చోటులేదన్నట్టుగా శంకరరాజు అన్నదముల్ని చూచాడు. వెంటనే లింగరాజు 'అంతాసరే అన్నా! ఆ చచ్చిపోయేది ఎవరు?' అన్నాడు.

'ఎవరో ఎందుకుచస్తారు? మనముగ్గురిలో ఒకరు చావాలి. నేనో, నువ్వో, వెంగళరాజో' అని శంకరరాజు చిన్నతమ్ముని వైపు చూచాడు.

'నేను చస్తానని ఎవరు ముందుకు వస్తారు' అని వెంగళరాజు గోడనుమాస్తూ ప్రశ్నించాడు.

'ఎవరూరా బనిలేదు. చీట్లుకలిపి వేస్తాం. ఎవరి పేరు వస్తే వాడు చావాల్సిందే. దీనికి మీరు అడ్డుమాట్లాడి ఏమీ లాభంలేదు. మానంపోయినా ఒకటే, ప్రాణంపోయినా ఒకటే' అని శంకరరాజు గబగబాలేచి వెళ్ళిపోయాడు.

## 4

అనుకొన్నదినం వచ్చేసింది.

'శంకరరాజు అండ్ బ్రదర్స్' కార్యాలయంలో ముగ్గురు అన్నదమ్ములు సంసిద్ధంగా కూర్చున్నారు. మూడుచీట్లపైమూడు పేర్లూ వ్రాసి వాటిని ఒకడబ్బాలో వేసి కదలించి శంకరరాజు దాన్ని టేబుల్ పైన పెట్టాడు. అందరికంటే చిన్నవాడు వెంగళరాజు గనుక అతడు కండ్లుమూసుకొని ఒక చీటును పైకితీశాడు. లింగరాజు ఆచీటీని పెరుక్కొని విప్పి దాన్లో ఉన్న పేరును చదివి అన్నవైపు శూన్యంగాచూచి దాన్ని అతని చేతికి అందిచ్చాడు. దాన్లోవున్న 'శంకరరాజు' అనే అగ్నివర్ణాలు ఆరునూదులవలే అతనికళ్లలో గుచ్చుకొన్నాయి.

శంకరరాజు తమాయించుకొని లేచి నిలబడ్డాడు. శిలావిగ్రహాలవలే కుర్చీల్లో కూలిపోయిన తమ్ముళ్ళను ఒకసారి చూచాడు. తరువాత గడియారంవైపు చూచాడు. గంట ఆరుకు అయిదునిముషాలు తక్కువగా ఉంది. శంకరరాజు సరిగ్గా ఆరుకు అలారం పెట్టి శాంతంగా వరాండా పిట్టగోడవైపు నడచి గోడకు ఆనుకొని రోడ్డువైపు చూడ్డం ప్రారంభించాడు.

గడియారం టిక్కుటిక్కు మంటున్నది. శంకరరాజు జీవితాన్ని తనవశంచేసుకొని గూడా గడియారం ఏమీ ఎరుగనట్టు తనపనిని తాను చేసుకొంటున్నది. పంకా తిరుగుతున్నప్పటికీ లింగరాజు గుడ్డలు చెమటలో తడిసి ముద్దైపోయాయి. వెంగళరాజు మన స్మారకంలోనే లేడు.

'రింగ్, రింగ్, రింగ్'

అలారం మ్రోగింది. తలవంచుకొని ఉన్న అన్నదమ్ములు వరాండావైపు చూచారు. అక్కడ శంకరరాజు లేడు!!

## 5

శంకరరాజు నేరుగా రోడ్డుమైపడివుంటే తల బ్రద్దలైఉండేది. అతడు వీరోచితంగానే మరణించి ఉండేవాడు. కానీ పైనుంచి క్రిందపడుతున్న అతనికి, రోడ్డుకు మధ్యగా ఒక రిక్షా రావడం తటస్థించింది. దీనివలన రిక్షా పైకప్పు, దాన్నుంచిక్రింద పడ్డశంకరరాజు కాలు రెండూ విరిగిపోవడం సంభవించింది. ఇందుకు ఫలితంగా రిక్షావాలాకు నష్టపరిహారము, శంకరరాజుగారికి కఱ్ఱకాలు లభ్యమైనవి.

★